క్లుప్తంగా

శాంతి స్థాపనకు కృషి చేయాలి

పెద్దారవీడు: సంఘ కాపరులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలని పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు కటారి శ్యాంసన్ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంఘాల్లో పనిచేస్తున్న పాస్టర్లంతా థియోలాజికల్ సర్టిఫికెట్ కలిగి ఉండటం ద్వారానే ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. సర్టిఫికెట్ అవసరమైన వారు తనను సంప్రదించాలని చెప్పారు. సర్టిఫికెట్ రిజిస్టర్ మ్యారేజ్‌లకు, ప్రభుత్వ పథకాల గుర్తింపునకు ఉపయోగపడుతుందని చెప్పారు.

ఒకేషనల్ విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన లెవల్-2 ఒకేషనల్ ఎడ్యుకేషన్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్కే ప్రసాద్ శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు ఒకేషనల్ విద్యలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ అంజిబాబు, డేవిడ్ పాల్గొన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేత

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్యకాలనీలో నివాసముండే దివ్యాంగుడైన డొక్క చినబాబుకు శనివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వీల్ చైర్ అందించారు. అధ్యక్ష, కార్యదర్శులు గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, కోశాధికారి తడికమళ్ల శ్రీనివాసులు, సభ్యులు పీవీ కృష్ణారావు, బచ్చు సుబ్రహ్మణ్యం, ఏ రామాంజనేయులు, గోరంట్ల చిన్న వెంకటరెడ్డి, జలీల్‌బాషా పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సేవా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్ల సేవా ర్యాలీని శనివారం సబ్ కలెక్టర్ త్రివినాగ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆర్డీఓ చందన, తహసీల్దార్ చిరంజీవి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



చాట్లమడ అగ్రహారం వెళ్లే రోడ్డుపై గుంత



రామాయపాలెం సమీపంలోని రోడ్డు మార్జిన్ వద్ద ఇలా..

రోడ్లను కమ్మేసిన ముళ్ల కంప

పెద్దారవీడు: మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులను ముళ్ల పొదలు కమ్మేశాయి. రామాయపాలెం-చాట్లమడ అగ్రహారం గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగాయి. సంబంధిత అధికారులు కొంత కాలం నుంచి పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి రోడ్డును ఆక్రమిస్తున్నాయి. దీంతో రహదారి ఇరుకుగా ఏర్పడి వాహదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు గుచ్చుకుని గాయాలవుతున్నారు. ఈ గ్రామాలకు నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూలమాలువు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రహదారిలో అక్కడక్కడా గుంతలు పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



రామాయపాలెం-చాట్లమడ మధ్య రోడ్డుపై చిల్లకంప

రోడ్డు దిగితే అంతే సంగతులు

రామాయపాలెం సమీపంలో రోడ్డు మార్జిన్ కోత కోయడంతో ఆ ప్రాంతం ఇబ్బందిగా తయారైంది. సింగిల్ రహదారిలో ఆర్టీసీ బస్సు, కారులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు సానికవరం, చాట్లమడ అగ్రహారం, చిన్నగుడిపాడు, బొమ్మలాపురం, తమ్మడపల్లి, దోర్నాల గ్రామాలకు తిరుగుతుంటాయి. మార్జిన్ లేక పోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడిచ్చే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో మార్జిన్లు కనిపించక పోవడంతో వాహనచోదకులు ఎప్పుడు ఏం జరుగుతోందనని భయాందోళనలు చెందుతున్నారు. సంబంధిత అధికారులు రహదారిపై ఉన్న గుంతలు, మార్జిన్లు పూడ్చించి ముళ్ల పొదలు తొలగించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాళ్లూరు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, ఎంపీటీసీ సభ్యుడు యామర్తి ప్రభుదాసు, దళిత నాయకుడు పాలెపోగు డగ్లస్ డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రం తాళ్లూరులో శనివారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద నల్ల రిబ్బన్లతో ధర్నా చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోట్లాది మంది భారతీయుల ఆశల కెరటం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అన్ని వర్గాల వారికి మేలు చేసిన ఆయన్ను అగౌరవం పరిచిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆదాం, దళిత నాయకులు పులి వికాస్, ఎ.సుబ్బారావు, ఎ.జక్రయ్య పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

పిచ్చిమొక్కల తొలగింపు

కొమరోలు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామసమీపంలో స్థానిక ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో శనివారం పిచ్చిమొక్కలను తొలగించారు. అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిలోని బ్రాహ్మణపల్లె వద్ద రహదారికి ఇరువైపులా ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లుగా గ్రహించిన ఎస్సై నాగరాజు జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మల్లారెడ్డిపల్లె, బ్రాహ్మణపల్లె, యర్రపల్లె, భావాపురం గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

వన్యప్రాణి వారోత్సవాలపై అవగాహన

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు వన్యప్రాణి వారోత్సవాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణులు స్వేచ్ఛాయుత వాతావరణంలో సంచరిస్తున్నాయని చింతల ఇన్‌చార్జి డీఆర్వో చెన్నయ్య పేర్కొన్నారు. వన్యప్రాణులు, అటవీ సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం 1973లో ప్రత్యేక చట్టం ప్రవేశ పెట్టిందని తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే నాన్‌బెయిల్‌బుల్ కేసు నమోదు, అభయారణ్యంలో అనుమతి లేకుండా ప్రవేశిస్తే ఎన్నో రకాలుగా క్రిమినల్ కేసులు ఉంటాయన్నారు. దీంతో పాటు అక్రమంగా ఆయుధాలు కలిగి అరణ్యంలోకి ప్రవేశించడం, వన్యప్రాణుల ప్రశాంతతకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేసి శిక్షలు విధిస్తారన్నారు. జీవవైవిధ్య పరిరక్షణ చట్టం ప్రకారం అరుదైన, సంరక్షక వృక్ష, జంతుజాలం సంచరించే ప్రాంతాల్లోకి అనుమతులు లేకుండా వెళ్లినా, వాటికి హాని కలిగించినా శిక్షలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్యామ్ ప్రసన్నతాంజలితో పాటు పలువురు ఉపాధ్యాయులు, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ప్రభుకుమార్, ఇసాక్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ గురువరకుమార్

బేస్తవారిపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కార్డు కలిగిన ప్రతి వేతనదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్ అన్నారు. శనివారం మండలంలోని పిటికాయగుళ్లలో కూలీలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకేవైసీ చేయించుకోని జాబ్‌కార్డులు ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్తారని, మస్టర్‌లోకి పేరు రాకపోవడంతో పని కల్పించలేమన్నారు. పంచాయతీ పరిధిలోని ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, మేట్స్‌ను సంప్రదించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ లాగిన్‌లో ఆధార్ అనుసంధానం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీఏ రమేష్ పాల్గొన్నారు.

దళిత నేతకు జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



ధర్మేంద్రతో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామానికి చెందిన దళిత నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత సంఘం ధర్మేంద్ర ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు కొర్రపాటి విష్ణు, ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఆలోకం హరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ నాయకులు కొర్రపాటి శరత్, గొళ్లపూడి ఎర్రయ్య, గువ్వల శ్రీనివాసరెడ్డి, లతీఫ్ (బచ్చా), యామర్తి ప్రభుదాస్, దేవదానం, జక్కుల రామకృష్ణ, గూడా గోపాల్‌రెడ్డి, నాగమల్లేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు షేక్ వలి, ముచ్చుమారి బ్రహ్మారెడ్డి, చిమట సుబ్బారావు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● తండ్రి, కుమారుడికి గాయాలు

పెద్దదోర్నాల: ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో తండ్రి, కుమారుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నదోర్నాల అడ్డరోడ్డు వద్ద శనివారం వేకువ జామున జరిగింది. ప్రమాదంలో చిన్న గుడిపాడుకు చెందిన వల్లభనేని ప్రసాద్, ప్రవీణ్ గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. చెన్నైలో విద్యాభ్యాసం చేస్తున్న కుమారుడు ప్రవీణ్‌ను అడ్డరోడ్డు వద్ద బస్సు ఎక్కించేందుకు చిన్నగుడిపాడుకు చెందిన తండ్రి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వచ్చి వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. 108 సిబ్బంది క్షతగాత్రులను మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



గాయపడిన తండ్రి, కుమారుడు

అవగాహన సదస్సును జయప్రదం చేయాలి

దర్శి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై అవగాహన సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సదస్సు ప్రచార కరపత్రాలు శనివారం ఆవిష్కరించారు. రమేష్ మాట్లాడుతూ నవంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు దర్శిలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు మాజీ శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పెద్ద ఎత్తున కూటమికి మద్దతు ఇచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా 12వ పీఆర్సీ అమలు కోసం డీఏలు, ఐఆర్‌ల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లతో పని భారం పెరుగుతోందని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పోరాడుతోందన్నారు. సమాన పనికి సమాన వేతనం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అమలు చేయాలని, జిల్లా మహాసభల్లో ఉద్యోగుల సమస్యలు చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు మాట్లాడుతూ జిల్లా మహాసభలు దర్శిలో మొదటిసారిగా జరుగుతున్నాయని, ప్రచారం, ఏర్పాట్లు కోసం వివిధ కమిటీలుగా ఏర్పడి కృషి చేస్తున్నాయని తెలిపారు. దర్శిలోని ప్రజాతంత్ర వాదులు, మేధావులు మహాసభల జయప్రదానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రైతు సంఘ నాయకులు సందు వెంకటేశ్వరరావు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, నాయకులు ఉప్పు నారాయణ, సీహెచ్ ఆదినారాయణ, గర్నిపూడి జాన్‌సామ్యేల్ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

సైబర్ క్రైంపై అవగాహన

పెద్దదోర్నాల: ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం తరహాలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్సై మహేష్ హెచ్చరించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజ్ ఆదేశాల మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామంటూ కొందరు ఫోన్ చేస్తారని, ఆధార్ కార్డుకు మీ మొబైల్ నంబర్ లింక్ కాలేదని, మీ మొబైల్ ఫోన్‌కు ఓటీపీ పంపిస్తున్నామంటూ బ్యాంకు ఖాతా నుంచి నగదు దోచుకునే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రత్యేకంగా యువకులు సైబర్ నేరస్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురై డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఎస్సై మహేష్



జగనన్న కాలనీ రోడ్డుపై లోతైన గుంతలతో మురుగు నీరు



దారుణంగా మారిన సీసీ రోడ్డు

నీరు వృథా..బురదతో వ్యథ

బేస్తవారిపేట:

వృథాగా పోయే నీరు రెండు వీధులను మురికిమయంగా మార్చేస్తోంది. బేస్తవారిపేట మండలంలోని జేసీ అగ్రహారంలో జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన సింగిల్‌ఫేజ్ మోటార్, సిమెంట్ రింగులతో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేశారు. నిత్యం చుట్టు పక్కల స్థానికులు నీటిని పట్టుకుంటున్నారు. వాటర్‌ట్యాంక్ నిండి నిత్యం నీరు వృథాగా పోతోంది. వృథా నీరు జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు, గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై చేరి నిల్వ ఉంటుంది. రోడ్డంతా లోతైన గుంతలమయంగా, మురికికూపంగా మారింది. దుర్వాసన వెదజల్లుతూ దారుణంగా మారింది. వృథా నీటిని అరికట్టడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యారు. చిన్నపాటి సమస్యను పరిష్కరించలేక వీధులను మురికికూపాలుగా మార్చడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెంచికలపాడు మెయిన్ రోడ్డు దుస్థితి ఇలా..

పెంచికలపాడులో..

మండలంలోని పెంచికలపాడులో మెయిన్‌రోడ్డు చివర మురికికూపంగా మారింది. గృహాల నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై చేరుతోంది. నిత్యం నీరు నిల్వ ఉండటంతో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డంతా మురికిమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. పాఠశాల వెళ్లేందుకు విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

కొమరోలు: గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సత్యం ఆదేశించారు. మండలంలోని రాజుపాలెం, ఇడమకల్లు గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ సత్యం శనివారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని, అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

అమ్మవారికి సబ్ కలెక్టర్ పూజలు

మార్కాపురం: మండలంలోని కుంట, కోలభీమునిపాడు గ్రామాల మధ్య ఉన్న ముద్దసానమ్మ గ్రామ దేవతకు శనివారం మార్కాపురం సబ్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ చిరంజీవి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలు మంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామివార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అదేవిధంగా మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకలు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామివార్లను వెండి కిరీటాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

పకడ్బందీగా రీ సర్వే

మార్కాపురం: భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. మండలంలోని నికరంపల్లి గ్రామంలో రీ సర్వే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పొలాలున్న రైతులందరినీ పిలిచి సమగ్రంగా రీ సర్వే చేయించాలని తహసీల్దార్ చిరంజీవికి సూచించారు. గ్రామ పూర్తి విస్తీర్ణం 1964 ఎకరాలని, మొత్తం సర్వే చేస్తున్నామని, రైతులందరూ హాజరుకావాలని తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. రైతులు వారి దగ్గరున్న వివరాలతో సర్వే టీములకు సహకరించాలని సూచించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్, పక్కన తహసీల్దార్ చిరంజీవి